ఏఐటీయూసీలో 100 మంది మున్సిపల్ కార్మికులు చేరిక

కార్మిక హక్కుల కోసం 104 ఏళ్ళుగా సుదీర్ఘ పోరాటాల చరిత్ర

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం మున్సిపాలిటీలో పని చేస్తున్న 100 మంది పారిశుధ్య కార్మికులు ఏ.ఐ.టి.యు.సి.లో చేరారు. గురువారం రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల కామ్రేడ్ ఎన్.ఆర్.దాసరి క్రాంతి భవనంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సఫాయ్ కార్మిక సంఘం, బి.ఎం.ఎస్., సి.ఐ.టి.యు. కార్మిక సంఘాల నుండి నుండి ఏ.ఐ.టి.యు.సి.లో చేరారు. ఈ సందర్భంగా ఏ.ఐ.టి.యు.సి.జిల్లా అధ్యక్షులు డోల శంకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖ రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పల రాజు మాట్లాడుతూ కార్మికుల, కష్ట జీవుల సమస్యలపై 104 ఏళ్ళుగా సుదీర్ఘ పోరాటాల చరిత్ర మన సంఘం అన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాడి 44 కార్మిక చట్టాలను సాధించుకున్న ఘనత ఉందన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదట పిలుపునిచ్చిన సంఘం అన్నారు. కార్మిక హక్కుల సాధనకు నిక్కచ్చిగా పోరాడుతున్న త్యాగాల చరిత్ర అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించుటకు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారు చిక్కాల గోవిందరావు, సీపీఐ నాయకులు టి.తిరుపతి రావు, ఎన్.బాబూరావు, జే.గురుమూర్తి, కె.వేణు గోపాల్, ఎన్.పార్థసారథి, బి.కూర్మారావు, ఎన్.సీతమ్మ, ఎం.రాఘవ తదితరులు మాట్లాడారు. ఏ.ఐ.టి.యు.సి. జిందాబాద్, పోరాడు తీరుతాం సాధించు తీరుతాం, సాధిద్దాం కార్మిక హక్కులను, కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించండి అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఏ.శంకర్, ఎన్.తిరుమల, టి. శ్రీను, ఇందిరా రమణి, టి.ఇందు, మంగమ్మ, లలితమ్మ, వెంకటరావు, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ప్రభుత్వం... గడపగడప ఉద్దేశం : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేసి, ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ ను నియమించి ప్రభుత్వ పాలనను నేరుగా ప్రజలకు అందిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. గురువారం సరుబుజ్జిలి మండలం, సింధు వాడ పంచాయతీ పరిధిలోని, వీరమల్లి పేట సిందువాడ గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఈ నాలుగున్నర సంవత్సరాలలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పార్టీలకు, కులాలకు, మతాలకు, వర్గాలకతీతంగా సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో రూ.1000 లు పింఛన్ ఇచ్చినప్పుడు గంటల తరబడి పంచాయతీ కార్యాలయం వద్ద, ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద నిలబడి వృద్ధులు వికలాంగులు ఇబ్బంది పడేవారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రూ. 2750 పింఛను ఒకటో తారీకునే సూర్యోదయం కంటే ముందే ఇంటికి వచ్చి వాలంటీర్లు అందిస్తున్నారని, ఇది చారిత్రాత్మక వ్యవస్థ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కెవిజి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, మండల సచివాలయాల కోఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్, వైస్ ఎంపీపీ లావేటి అనిల్ కుమార్, బి సి సెల్ డైరెక్టర్ ముద్దాడ్ల రమణ, ఎస్ సి సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ గోవింద కామేశ్వరి, స్థానిక ఎంపీటీసీ మరియు మండల వైస్ ఎంపీపీ శివానంద బాబు, స్థానిక నాయకులు జలపాల పాపారావు, ఊటపల్లి రామకృష్ణ, కేళ్లి సూరిబాబు, లంక దుర్గాభవాని, సిరిపల్లి శ్రీనివాసరావు, కొరపాపు గోవిందరావు, రాజారావు తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళాలు అందించండి : కలెక్టర్ పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : సాయుధ దళాల పతాక దినోత్సవానికి అందరూ విరాళాలను అందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్ లో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ. శైలజ, మాజీ సైనిక జిల్లా అధ్యక్షులు కె.పూర్ణ చంద్రరావు, ఉపాధ్యక్షులు వి.సూర్యనారాయణ, నేవీ ప్రతినిధి యస్. రమణమూర్తి, ఆర్మీ ప్రతినిధి పి. మురధరరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా సాయధ దళాల పతాక దినోత్సవానికి సంబంధించి పోస్టర్ ఆవిష్క రించారు. అనంతరం కలెక్టర్ తన వంతు విరాళాలను అందించారు. సాయుధ దళాల దినోత్సవానికి అందరూ తమ వంతు విరాళాలను విరివిగా అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాకదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు, మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్వి స్తుందన్నారు. పాకిస్తాన్, చైనా యుద్ధ సమయాలలోను, కార్గిల్ పోరాటంలో, బొంబాయి తాజ్ హెూటల్ దురాక్రమణ సమయంలోను, ప్రకృతి వైపరీత్యాల సమయంలోను మన సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు, జాతి యావత్తు గర్వించుచున్నట్లు తెలిపారు. ఈయేడాది డిశంబరు 7వ తేదీన పతాక నిధికి విరివిగా విరాళాలు అందించవలసినదిగా జిల్లాలోని పౌరులను, వ్యాపార వేత్తలను, పారిశ్రామిక దారులను ఆయన కోరారు. మీరు అందించే విరాళాలను, డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు / డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, పెద్దరెల్లి వీధి, శ్రీకాకుళంనకు పంపవలసిందిగా ఆయన కోరారు. పతాక నిధి కి అందించే విరాళాలకు 80(జి)(5) (ఆరు) ఇన్‌కమ్ ట్యాక్స్ 1961 ద్వారా ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందన్నారు.

జిల్లాలో ఉన్నతి యూనిట్ కింద 13 మహిళా శక్తి ఆటోలు పంపిణీ

జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఆటో నడిపే మహిళలను మరింత మంది మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లాలోని మహిళలకు ఉన్నతి యూనిట్ ద్వారా 13 ఆటో రిక్షాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ఆటో రిక్షాల తాళాలను మహిళా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉన్నతి కార్యక్రమంలో నిరుపేదలైన ఎస్.సి., ఎస్.టి. మహిళలకు వడ్డీ లేని రుణంతో "మహిళా శక్తి పథకం"లో ఆటో రిక్షాలు పంపిణీ కార్యక్రమం మంచి కార్యక్రమన్నారు. ఉన్నతి యూనిట్ ద్వారా మహిళా శక్తి ఆటో లబ్ధిదారుల ఎంపికకు లబ్ధిదారులు స్వయం సహాయక సంఘాలలో సభ్యులై ఉండి ఎస్.సి., యస్.,టి కులాలకు చెందిన వారై ఉండాలన్నారు. లబ్ధిపొందే మహిళా వయస్సు 20 దాటి 45 సం.ల లోపు ఉన్నదాలని, లబ్ధిదారులు తప్పని సరిగా ఎల్.ఎల్.ఆర్./ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. ఆటో కొనుగోలు చేసేటప్పుడు లబ్ధిదారులు 10శాతం కాంట్రిబ్యూషన్ చెల్లింపు చేసి ఉండాలన్నారు. గతంలో తీసుకున్న ఉన్నతి/స్త్రీనిధి అప్పు ఉండరాదని, ఎవరికి ఎలాంటి ఆటో కావాలో (పాసింజర్ / లగేజి ఆటో), కావలసిన కంపెనీ, తదితరమైనవి లబ్ధిదారులే ఎంపిక చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో మొత్తం 13 మండలాలకు సంబంధించి 13 మంది లబ్ధిదారులు ఆటో కొనుగోలు నిమిత్తం దరఖాస్తు చేసుకోగా నియోజక వర్గాల వారిగా చూస్తే శ్రీకాకుళం నియోజక వర్గంలో శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట నియోజకవర్గంలో పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలు కాగా, టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, పలాస నియోజక వర్గంలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు ఉండగా, ఆముదాలవలస నియోజకవర్గంలో

ఆముదాలవలస, సరుబుజ్జిలి మండలాలు ఉన్నట్లు చెప్పారు. ఎచ్చెర్ల నియోజక వర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం మండలాలు ఉండగా, పాతపట్నం నియోజక వర్గంలో ఎల్.ఎన్.పేట, మెళియాపుట్టి మండలాలు ఉన్నాయన్నారు. బజాజ్ కంపెనీ ఆటోలు-10, అపే కంపెనీ ఆటోలు-3 లబ్ధిదారులు ఎంపిక చేసుకోగా, లబ్ధిదారులకు రూ. 42,45,927/-లు (కంట్రిబ్యూషన్ - 4,27,000/- రుణం-36,18,935/-) వడ్డీ లేని రుణం ఉన్నతి యూనిట్ ద్వారా మంజూరు జరిగిందన్నారు. 48 వాయిదాలలో (ఎటువంటి వడ్డీ లేకుండా) అప్పు తిరిగి చెల్లింపు చేయవలసి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి విద్యాసాగర్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

సారవకోట, జలుమూరు మండలాల్లో 'జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమం

విశాలాంధ్ర-జలుమూరు : జలుమూరు మండలం మర్రివలస, సారవకోట మండలం బద్రి గ్రామాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు నరసన్నపేట సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాలలో పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. జలుమూరు, సారవకోట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, అభిమానులు, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రేయాస్ ఇండస్ట్రీస్ సాయంతో గ్రామాలకు గ్రావెల్ రోడ్లు

విశాలాంధ్ర-రణస్థలం : మండలం, అరోబిందో ఫార్మా అనుబంధ సంస్థ అయిన పైడిభీమవరం పంచాయతీలో ఉన్న శ్రేయాస్ ఇండస్ట్రీస్ వారు - ఆక్సిస్ క్లినికల్స్ లిమిటెడ్ మద్దతుతో సామజిక బాధ్యతలో భాగంగా ఎన్‌జీఆర్‌పురం, అక్కయ్యపాలెం గ్రామాలలో ఉన్న ప్రజల అందరికి ఉపోయోగపడేలా గ్రావెల్ రోడ్లని శ్రేయాస్ ఇండస్ట్రీస్ అండ్ అరోబిందో ఫార్మా ప్రతినిధులు గ్రావెల్ రోడ్లని ప్రారంభించారు. ఈ విధంగా గౌరవప్రదమైన సంస్థగా, సీఎస్ఆర్ నిధుల క్రింద సామాజిక ప్రయోజనం పట్ల నిస్వార్థ ప్రయత్నాలతో మీ అపారమైన మద్దతు అభినందనీయమని ఆక్సిస్ క్లినికాల్స్ లిమిటెడ్ యాజమాన్యం నిత్యానంద రెడ్డి, శరత్ చంద్రరెడ్డి కి గ్రామా పంచాయతీ, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోలులో నాణ్యతల సడలింపు

వ్యవసాయ అధికారి మోహనరావు

విశాలాంధ్ర-ఆమదాలవలస : మీచౌంగ్ తుఫాన్ రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. పంట చేతికి అంది వచ్చిన తరుణంలో తుఫాన్ సృష్టించిన బీభత్సంతో రైతులు కుదేలయ్యారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రతిపక్షాలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. ఈ దశలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆముదాలవలస వ్యవసాయ అధికారి మండలంలోని పలు గ్రామాలు తిరిగి పంట నష్ట పరిస్థితులను అంచనా వేశారు. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు నాణ్యత ప్రమాణాలను సడలించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు రైతులకు వివరించారు. పొలాల్లోని కోసిన వరి పనలు వర్షానికి తడిసి నీట మునిగాయి. వాటిని కొనుగోలు చేసే సమయంలో నాణ్యతల సడలింపు ఉంటుందని రైతులకు హామీ ఇచ్చారు. కొన్నిచోట్ల కోతకు వచ్చిన వైరు పేరు నేలకొరిగింది. ఇప్పటికే పొలాల్లో ఉన్న పంటను కొన్నిచోట్ల రైతులు కుప్పలుగా వేశారు. వాటిని వ్యవసాయ అధికారి పరిశీలించారు. మునిగిన వరి ఎన్నులను మీరు తగ్గిన తర్వాత ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని వాటిపై పిచికారి చేయాలన్నారు. తోపాటు ఆర్.బి.కె ఏఈఓలు రైతులు ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలి

- అడిషనల్ సి.ఈ.ఓ ఎం.ఎన్.హరేంద్రప్రసాద్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాల్లో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటివరకు పెండింగులో ఉన్న దరఖాస్తులపై దృష్టి సారించాలని అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్ జాయింట్ కలెక్టర్లను కోరారు. 10 మంది కంటే ఎక్కువ ఉన్న ఓటర్లు, వందేళ్ల నిండిన వాటిని పున:పరిశీలించి వారంలోగా ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ఎటువంటి పెండింగ్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్ దరఖాస్తులపై జాయింట్ కలెక్టర్లతో అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా జాబితా విడుదల చేసే అక్టోబర్ 27 నాటికి 0-0 నంబర్ తో ఉన్న 2206 ఓటర్ల ను గుర్తించామని వాటి సంఖ్యను 114కి తగ్గించ గలిగామన్నరు. ఇంటి నెంబర్తో 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న మిగిలిన మూడు ఇళ్లను కూడా త్వరలోనే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వాటిని కూడా సరి చేస్తామన్నారు. ఈ సంఖ్య అక్టోబర్ 27 నాటికి 1122 ఇళ్లకు 15222 ఓటర్లుగా ఉండేదని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెసి నవీన్ తో పాటు డిఆర్ఓ ఎం గణపతి రావు కూడా ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకులు తొలగింపు

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డు 80 అడుగుల విస్తరణ పనులకు ఉన్న అడ్డంకులను పూర్తిగా తొలగింపుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం రోడ్డు పనులను కమిషనర్ టి. నాగేంద్ర కుమార్ పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికే దాదాపు పూర్తి అయినప్పటికీ రోడ్డుపై ఉన్న పాత విద్యుత్ ట్రాన్సఫార్మర్‌లు తొలగించి, రోడ్డుకు అవతలి వైపు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ సిబ్బందికి కమిషనర్ టి నాగేంద్రకుమార్ ఆదేశించారు. కేటీ రోడ్డుపై ఉన్న ట్రాన్సఫార్మర్‌లు తొలగిస్తే, పూర్తిస్థాయిలో 80 అడుగుల రోడ్డు పనులు పూర్తయినట్లేనని చెప్పారు. రాజాలక్ష్మి, ముత్యాలమ్మ కోనేరు పార్క్ తదితర ప్రాంతాలలో ట్రాన్సఫార్మర్‌ల మార్పు పనులు తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. పనులు పరిశీలించిన వారిలో మున్సిపల్ డిఇ సునీల్ కుమార్, ఎ ఇ అవినాష్, 9 వ వార్డు కౌన్సిలర్ గుజ్జు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు అపార నష్టం

విశాలాంధ్ర-జలుమూరు : మొక్కజొన్న పంటకు అపార నష్టం మిచాంగ్ తుపాను వర్షాల కారణంగా మొక్కజొన్న పంటకు అపార నష్టం జరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట వేసుకున్న పొలాల్లో నీరు చేరడంతో మొక్కజొన్న పంట చనిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. నీరు కింద ప్రాంతానికి వెళ్లే అవకాశం లేక పొలాల్లో నేను నిలిచిపోయిందని రైతులు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : ఈనెల 15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కంచిలి మండలం మకరాంపురం వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా జలజీవన్ మిషన్ తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్కర్, ఎస్పి జి.ఆర్.రాధిక, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్, సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి, పైల దేవదాసురెడ్డి తదితరులు కలిసి హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నీటి పథకం ఏర్పాట్లను కూడా పరిశీలించారు.

31లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-సోంపేట : జనవరి 31లోగా జగనన్న కాలనీలో స్థలాలు పొందిన గృహలబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేయాలని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ పి.వెంకట రమణ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గురండి పెద్దలను కలుద్దాంలో 'సిరిపురం'

విశాలాంధ్ర-కొత్తూరు... మండలం గురండి గ్రామంలో పాత పట్నం సీనియర్ నాయకులు ,విద్యావేత్త సిరిపురం తేజేశ్వర్‌రావు పెద్దలను కలుద్దాం... యువతకు చెప్పుదాం కార్యక్రమం నిర్వహించారు రానున్న ఎన్నికల్లో పాతపట్నం నుండి ప్రజా అభ్యర్థిగా పోటీ చేస్తున్న ను మీ మద్దత్తు ఇవ్వండి నియోజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని సిరిపురం గురండి పెద్దలకు తెలిపారు.

వైకాపా పథకాలతో ప్రజల ముందుకు వెళ్లాలి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : వైకాపా ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న పథకాలతో ప్రజల ముందుకు వెళ్లాలని సంత బొమ్మాళి మండలం జడ్పీటీసి పాలవసంత రెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి అప్పారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి ఎందుకు అవసరం అనే కార్యక్రమంపై సంత బొమ్మాళి పంచాయతీ సచివాలయం 2 పరిధిలో సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నవరత్నాలు పథకాలతో, సచివాలయాలు ఏర్పాటుతో ప్రజా పాలన మరింత సౌలభ్యంగా ఏర్పడిందని, అందుకు రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వారు అన్నారు. అంతకుముందు వైకాపా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన పథకాలను బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ ప్రేమలీల, సర్పంచ్ ఎన్ని మన్మధరావు, పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి సూరాడ వెంకటేష్, బోరుభద్ర పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బుసకల లక్ష్మీకాంతం లక్ష్మయ్య, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయం ఉద్యోగులు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏపీ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస : న్యాయవాదులపై గొడ్డలి పెట్టుగా ఉండే ఏపీ టైటిలింగ్ యాక్ట్ 2023ను ఉపసంహరించు కోవాలని ఆముదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు బార్ అసోసియే షన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి బాయి ఆధ్వర్యంలో గురువారం విధులు బహిష్క రించి నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా తెచ్చిన టైటిలింగ్ యాక్ట్ లో పొందుపరచిన యు/ఎస్ 38 మరియు కొన్ని ప్రొవిజన్స్‌లో పేర్కొన్న అంశా లు, లిటిగెంట్ పబ్లిక్ కు మరియు న్యాయవాదులకు గొడ్డలి పెట్టులాంటి చట్టం అని న్యాయవాదులు అన్నారు. సివిల్ కోర్టుల పరిధి నుండి పూర్తిగా లిటిగేషన్ తప్పించి ప్రభుత్వమే ఒక ప్రత్యేక అధికారిని నియ మించి లిటిగెంట్ పబ్లిక్ యొక్క ఆస్తిపై హక్కు లను పరిష్కరించి తీర్పు వెలువరించే అధి కారం ఆ అధికారికి ఇవ్వబడింది అన్నారు. ఆ ఆర్డర్‌పై లోకల్ ఏ సివిల్ కోర్టుకు పరిధి లేదు కేవలం హైకోర్టు కు మాత్రమే అధికారం, ఆ చట్టంలో పొందు పరిచారు. దీని కారణంగా రాష్ట్రంలో వుండే దాదాపు 90 వేల మంది న్యాయవాదు ల భవిష్యత్ ప్రశ్నార్థక మౌతుం ది అని ఆవేదన చెందారు. కనుక ఆ చట్టాన్ని పూర్తిగా నిషేధించి న్యాయ వాదుల హక్కులు కాలరాయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగానే బుధ గురు శుక్రవారం బార్ అసోసియేషన్ నిర్ణయం మేరకు న్యాయ వాదులు కోర్టు విధులు బహిష్కరణ చేయాల ని బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యా రావు అధ్యక్షతన నిర్ణయం పై మూడు రోజులు కోర్టు విధులు బహిష్కరణ చేయాలని నిర్ణయించారు. సీనియర్ జూని యర్ న్యాయవాదులు విధులు బహిష్క రించిన వారిలో ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి - విశ్రాంత డి.ఎస్.పి ప్రసాదరావు

విశాలాంధ్ర-కవిటి : ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు విశ్రాంత డి.ఎస్.పి ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పలు ఆలయాల అభివృద్ధికి నలభై ఐదు వేల రూపాయలు విశ్రాంత డిఎస్పి ప్రసాదరావు మనవడు, మనవరాలు విరాళంగా అందజేశారు. విశ్రాంత డిఎస్పి ప్రసాదరావు మనమరాలు అరియ,మనుమడు విరాట్ కోరిక మేరకు కవిటిలో నిర్మాణ పనులు చేపడుతున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి 25వేలు, సహలాలపుట్టుగ గ్రామంలోని సప్తబోని అమ్మవారి దేవాలయం నిర్మాణానికి పదివేల రూపాయలు, కవిటి బెహరా వీధిలోని జగన్నాథ స్వామి ఆలయానికి 10వేలు రూపాయలు అందజేసినట్లు తెలిపారు. అలాగే కవిటిలో నిర్మాణం చేపడుతున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కొరకు తోటి మిత్రులు జమేదారి పుట్టుగ గ్రామానికి చెందిన కృష్ణా రౌలో 200 బస్తాలు సిమెంట్, విశాఖపట్నం కి చెందిన రోహన్ కుమార్ 125 బస్తాలు సిమెంట్,కవిటి గ్రామానికి చెందిన మొగలిపురి కృష్ణారావు వంద బస్తాలు సిమెంట్,శ్రీరాంపురం గ్రామానికి చెందిన మాదిన వెంకటరమణమూర్తి వంద బస్తాలు సిమెంట్ ఆలయాలు నిర్మాణానికి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీపీ రెడ్డి,బర్ల నాగభూషణం, జన్నెల లోకనాథంతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనా ఏర్పాట్లను మంత్రి, కలెక్టర్, ఎస్పీలు పరిశీలన

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహనరెడ్డి ఈ నెల 15న పలాస రానున్న నేపథ్యంలో సి.ఎం పర్యటన ఏర్పాట్లును రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకర్ బాలాజీ లఠ్కర్, జాయింట్ కలెక్టర్ నవీన్, ఎస్పీ రాధికలు కాశీబుగ్గ పద్మనాభపురం సమీపంలో నిర్మించిన 200 పడకల ఆసుపత్రి మరియు కిడ్నీ పరిశోధన కేంద్రం, హెలిప్యాడ్ స్థలం, సి.ఎం బహిరంగ సభ పరిసర ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ టెక్కలి, పలాస డివిజన్ పరిధిలో ఉన్న ప్రాంతాలు నుంచి బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు రానున్నారని, వారికి బహిరంగ సభకు వచ్చే సమయంలో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా విడిచి పెట్టే విధంగా చూడాలని కలెక్టర్, ఎస్పీలను కోరారు. బహిరంగసభ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్, విఐపి గ్యాలరీ, సిఎం ఆసుపత్రి నుంచి బహిరంగ సభకు వస్తున్న రహదారిలో భారీగా బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీకర్ బాలాజీ లఠ్కర్ మాట్లాడుతూ కిడ్నీ ఆసుపత్రి పనులు ఎంత శాతం పూర్తి అయింది.. ఇంకా ఏ మేరకు పనులు చేయాల్సి ఉంది తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిటీ స్కాన్, ఎంఆర్ ఐస్కాన్ సిద్ధంగా ఉందా..? లేదా..? ఇప్పటివరకు ఎంత మందిని ఉద్యోగులను నియమించాం..? ఇంకా ఎంత మంది ఉద్యోగులను నియమించాల్సి ఉందన్న అంశాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సమీపంలో ఉన్న హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాశీబుగ్గకు చెందిన ప్రైవేటు వ్యక్తి లేఅవుట్లో హెలీప్యాడ్ నిర్మాణం చేపడుతున్నామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆర్. అండ్.బి అధికారులకు ఆదేశించారు. హెలిప్యాడ్ చుట్టూ వైపు, సిఎం హెలిప్యాడ్ నుంచి కిడ్నీ ఆసుపత్రి వైపు వెళ్ళే రహదారిలో బారీ స్థాయిలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. లేఆవుట్‌లో విద్యుత్ స్తంభాలు ఉండడంతో ఇబ్బందులు తలెత్తే పరిస్థితులున్నాయని, తక్షణమే వాటిని తొలగించి సి.ఎం తిరిగి ప్రయాణం అనంతరం యాధావిధిగా స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖాధికారులకు ఆదేశించారు. హేలిప్యాడ్ నుంచి ఆసుపత్రి వరకు సి.ఎం వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అలాగే కాశీబుగ్గ రైల్వే మైదానంలో సి.ఎం బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో ఆసుపత్రి నుంచి రైల్వే మైదానం వరకు భారీ స్థాయిలో బారీకేడ్లు ఏర్పాటుచేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈయన వెంట పలాస ఆర్డీవో భరత్ నాయక్, కాశీబుగ్గ డిఎస్పి నాగేశ్వరరెడ్డి, అర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఇ.ఇ. సత్యన్నారాయణ, ఎలక్ట్రికల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, జిల్లా పంచాయితీ అధికారి రవి కుమార్, డీఎల్ పిఓ ఐ వి రమణ, ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, తహశీల్దార్ ఎల్.మధుసూదన రావు, ఆర్ అండ్ బి ఎ.ఇ విక్రమ్, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, సి.ఐ నవీన్ కుమార్, పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్, వైసీపీ నాయకులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, ఇంజనీరింగ్ శాఖాధికారులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి... కాంగ్రెస్ నాయకులు డిమాండ్

విశాలాంధ్ర-అరసవల్లి: మిచౌంగ్ తుఫాను వల్ల గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు శ్రీకాకుళం జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని శ్రీకాకుళంలో విడుదల చేసిన ఓ ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు నేతృత్వంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు డి గోవింద మల్లిబాబు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెళ్ల సురేష్, ఆ పార్టీ సీనియర్ నాయకులు మంత్రి నరసింహ మూర్తి, కూరాకుల వెంకట్రావు ,రమేష్ బాబు, కే.ధర్మారావు తదితరులు జిల్లాలో ముంపు ప్రాంతాల్లో పర్యటించి పొలాల్లో తడిచిన వరిచేలను పరిశీలించారు. పలువురు రైతుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడి మూడు రోజులు గడుస్తున్నా ఇంతవరకు క్షేత్రస్థాయిలో అధికారులు రైతుల వద్దకు చాలా చోట్ల రాలేదని తక్షణం పంట నష్టం అంచనా వేసేందుకు క్షేత్రస్థాయి బృందాలు పర్యటించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పొలాల్లో పండిన వరి పైరు చాలాచోట్ల కోత కోయకుండా ముంపులో మునిగిపోగా మరికొన్ని చోట్ల కోసిన వరి చేను పొలాల్లో తడిసి పనికిరాకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో టెక్కలి శ్రీకాకుళం కాశిబుగ్గ రెవెన్యూ డివిజన్లో అనేక చోట్ల ఈ పరిస్థితి నెలకొన్నందున వాస్తవ స్థితిగతుల్ని ప్రభుత్వ అధికారులు అంచనా వేయాలని వారన్నారు కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి బృందాలు ఇప్పటికే నష్టపోయిన రైతులను కలుస్తున్నారని పేర్కొన్నారు.బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా గున్న

విశాలాంధ్ర - మందస: యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా గున్న రమేష్‌ను ఎన్నికయ్యారని మందస యుటిఎఫ్ అధ్యక్షులు జగదీష్ బడిత్య తెలిపారు. గురువారం హరిపురంలో యుటిఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కోటబొమ్మాళిలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా కౌన్సిల్‌లో నూతనంగా జిల్లా కార్యదర్శిగా గున్న రమేష్‌ను ఎన్నికయ్యారని, రమేష్ 3సార్లు రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ ఎన్నిక పట్ల పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాజాన పరమేశ్వరరావు, దాసరి ఈశ్వరరావు, కొర్ల తేజేశ్వరరావు, గంట గోపాలక్రిష్ణ, ప్రియాంక మహరణ, శిస్టు సోమనాథ్, కంచరాన మాధవరావు, పిన్నింటి కొండలరావులు పాల్గొన్నారు.

ఎంపీపీ పరామర్శ

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట మండలం గొల్లవూరు గ్రామానికి చెందిన మృత్యుంజయ బెహరా బుధవారం బారువ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు గురువారం పరామర్శించారు. ఆ కుటుంబానికి మనో ధైర్యం కలిగించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎంపీపీతో సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, శిలగాన భాస్కరరావు, బుద్ధాన శ్రీకృష్ణ, రౌతు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అరోగ్య యోజన కార్డులు, ఉజ్వల గ్యాస్ పంపిణీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పై అవగాహన పెంచుకోవాలని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. ఫణీంద్రకుమార్ అన్నారు. ఆయన గురువారం మండలంలో గల చిట్టీవలస, దంత పంచాయతీలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రధానమంత్రి జన్ అరోగ్య యోజన కార్డులను, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌ను అందజేశారు. అంతకుముందు కేంద్రపథకాలను వివరించే 2024 సంక్షేమ క్యాలండర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, సర్పంచ్‌లు సంపతిరావు వెంకటరమణ, గొండు చాందిని, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సమాజంలో ఒక భాగం

విశాలాంధ్ర-కొత్తూరు : ఏదో ఒక కారణం వల్లో, జన్యు లోపంవల్లో దివ్యంగులుగా ఉన్నవారు సమాజంలో ఒక భాగంగా అందరూ చూడాలని, వారిని అన్ని విధాలుగా మనం ప్రోత్సహించాలని జిల్లా వైసీపీ కమిటీ కోశాధికారి వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక భవ్యా మానవవనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దివ్యంగులను ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తుంది అని అన్నారు ఏ ఒక్క రంగంలో దువ్యాంగులు ఎవరికి తీసిపోరని అన్నారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగులకు లాప్‌టాప్‌లు, వివిధ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస రావు, హైస్కూల్ గెజిటెడ్ హెచ్.ఎం. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన పక్కాగా చేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : కుల ఆధారిత సర్వే (గుల గణన)పై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సచివాలయ వార్డు సెక్రటరీలు వలంటీర్లు అందరూ తమ పరిధి కౌన్సిలర్లతో కలిసి సర్వే పక్కాగా చేయాలని మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కోరారు. కమీషనర్ ఎన్. రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జే.సి.ఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, కౌన్సిలర్లు బచ్చు జగన్, మధు మూర్తి, ప్రేమ్ కుమార్, ప్రదీప్ శ్యాముల్, ఆశి లీలారాణి, ఆధి రెడ్డి, వై.ఎస్.ఆర్.సి.పి. ప్రతినిధులు నీలాపు ఢిల్లీ, టెంక లోకేష్, వార్డు సెక్రెటరీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించుటమే ప్రభుత్వ లక్ష్యం

ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ప్రతీ ఇంటికి జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా సురక్షితమైన త్రాగునీరు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. గురువారం సరుబుజ్జిలి మండలం వీరమల్లిపేట గ్రామంలో రూ. 29 లక్షలతో నిర్మించిన జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచి నీటి కొళాయి కార్యక్రమాన్ని సభాపతి ప్రారంభించారు. అలాగే సింధువాడ గ్రామంలో సుమారు రూ. 55 లక్షల నిధులతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ గృహ అవసరాల కొరకు నీటికై పరుగులు తీయవలసిన అవసరం లేదని... ఇక మహిళలకు ఎంతో సమయం ఆదామవుతుందని అన్నారు. కౌమారదశలో ఉన్న బాలికలు నీటి సేకరణలో తమ తల్లికి సహాయం చేయడం కోసం ఇకపై వెళ్లవలసిన అవసరం ఉండదన్నారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించడం ద్వారా.... గ్రామీణ ప్రజానికం వివిధ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు దోహదం చేస్తుందన్నారు. నవజాత శిశువులు నీటి రోగాలకు ఎక్కువ అవకాశం ఉందన్నారు. ఐదు సంవత్సరాల కంటే తక్కువ ఉన్న పిల్లల్లో ప్రతి 4 మరణాలలో 1 మరణం కలుషిత నీటి వల్లే సంభవిస్తుందని అన్నారు. సురక్షితమైన నీటిని అందించడం ద్వారా వీటిని నివారించవచ్చని సభాపతి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి అవకాశాలను కూడా జె జె ఎం సృష్టిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె వి జి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, మండల సచివాలయాల కోఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్, వైస్ ఎంపీపీ లావేటి అనిల్ కుమార్, బి సి సెల్ డైరెక్టర్ ముద్దాడ రమణ, ఎస్ సి సెల్ డైరెక్టర్ ఎద్ల ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ గోవింద కామేశ్వరి, స్థానిక ఎంపీటీసీ మండల వైస్ ఎంపీపీ శివానంద బాబు, స్థానిక నాయకులు జలపాల పాపారావు, ఊటపల్లి రామకృష్ణ, కేల్లి సూరిబాబు, లంక దుర్గాభవాని, సిరిపల్లి శ్రీనివాసరావు, కొరపాపు గోవిందరావు, రాజారావు తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పోస్టల్ సూపరెండెంట్ శ్రావణ కుమార్

విశాలాంధ్ర -కోటబొమ్మాళి: జిల్లాలో పోస్టల్ సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరెండెంట్ పల్లి శ్రావణకుమార్ అన్నారు. గురువారం స్థానిక పోస్టు ఆఫీస్‌ను ఆయన అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేటు సంస్థల మోసాలకు గురికాకుండా ఉండేందుకు మీకు దగ్గరలో ఉన్న పోస్టు అఫీస్‌లో డిపాజిట్ చేయాలని, అలాగే కేంద్రప్రభుత్వం పోస్టు ఆఫీస్ ద్వారానే వినూతనమైన భీమా పథకాలను అమలు చేస్తుందన్నారు. ఐపిపిబి (ఇండియన్ పోస్ట్ పేమెంట్‌బ్యాంక్) పథకాన్ని అమలులోకి తెచ్చింద న్నారు. ఈపథకంలో లబ్దిదారులు కేవలం ఆధార్‌నెంబర్, వేలిముద్ర తో ఖాతాను ప్రారంభించ వచ్చునని ఖాతా ఎక్కడ ఉన్నకానీ ఇండియాలో ఎక్కడైన పోస్టు ఆఫీస్ ద్వారా విత్‌డ్రా చేసుకోవచ్చునన్నారు. ఆలాగే యేదాదికి రూ. 400లు చొప్పున్న భీమా చెల్లిస్తే రూ. 10లక్షలు ప్రమాదభీమా వర్తిస్తుందని, టాటా, బజాజ్ సంస్థలతో అనుబంధం కుర్చుకోవటం ద్వారా ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య ఖర్చులకోసం రూ. 60వేలు, పిల్లల చదువులకోసం లక్షరూపాయిలు వర్తిస్తుంద న్నారు. అయితే ఇందుకు 18 సంవత్సరాలు వయస్సు నుంచి 65 సంవత్సరాలు వయస్సు కలిగిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. అలాగే పోస్టు అఫీస్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో అనేక సేవలు అందిస్తున్నామని, ప్రజలు స్థానిక పోస్టు ఆఫీస్‌కు సంప్రదిస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంల టెక్కలి అసిస్టెంట్ పోస్టల్ సూపరెండెంట్ డివిఎన్ ప్రతాప్, స్థానిక పోస్టుమాస్టర్ మెండ ఉపేంద్రరావులు ఉన్నారు.

భవిష్యత్‌కు విద్య ఒక ఆయుధం

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణలో మంత్రి డా.సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస: విద్యార్థులు చిన్న తనం నుంచే విద్యా పై దృష్టి సారించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్య ఒక ఆయుధంలా ఉపయోగపడుతుందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాలలో పని చేస్తున్న పిఈటి పి. తవియ్య తన తల్లిదండ్రులు అచ్చమ్మ, పోతయ్య జ్ఞాపకార్ధంగా తన సొంత నిధులతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు ప్రయాణం చేయాలన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరు సమానంగా ఉండాలని, అందుకు రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అన్నారు. గతంలో కొంత మందికి మాత్రమే ఓటు హక్కు ఉండేదని, అంబేద్కర్ ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని యూనివర్సల్ ఓటు హక్కు తీసుకువచ్చారన్నారు. అంటరాని తనం రూపుమాపేందుకు, దేశం ప్రగతి పథంలో ముందుకు సాగేందుకు అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. అందరూ సమానమనే నినాదంతో అంబేద్కర్ పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు రాజ్యాంగంలో కల్పించారన్నారు. కార్యక్రమంలో

మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి దాసరథి, ఎఎంసి చైర్మన్ పి వి సతీష్, కౌన్సిలర్లు దున్న సత్యం, సనపల సింహాచలం, శిష్టి గోపి, వైసీపీ నాయకులు తూముల శ్రీనివాసరావు, అంబటి ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబును నమ్మితే భవిష్యత్తు ఉండదు : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్వప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజలపై విషం కక్కే కాలనాగు ప్రతి పక్షనేత చంద్రబాబునాయుడు అని, బాబును నమ్మితే భవిష్యత్తు ఉండదని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. గురువారం మండలం లఖందిడ్డి సచివాలయం నందు వైపీపీ నీడ్స్ జగన్ కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. 2019లో ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెలవేర్చిన మన జగనన్న పాలన గురించి ప్రతి గడపలో తెలియజేయడమే వైపీపీనీడ్స్ జగన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ముందుగా లబ్దిదారుల సమాచార పట్టిక (డిస్‌ప్లే)ను అవిష్కరించిన అనంతరం వైయస్సార్సీపి జెండాను మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజుతో కలిసి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పొరపాటున చంద్రబాబు వస్తే 75 శాతం సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, అందుకే ప్రజలంతా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు మీ ఇంటికి తీసుకువస్తున్న జగనన్న ప్రభుత్వానికి ఓటువేసి మళ్లి ముఖ్యమంత్రిని చేద్దామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమ సుందరరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు స్థానిక సర్పంచ్ బమ్మిడి గణపతి, జేఎస్‌సీ కన్వీనర్ గద్దవలస నాగభూషణరావు, వైకాపా నాయకులు పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, సింగుపురం వినోద్, హనుమంతు తేజ, బమ్మిడి శ్రీరాములు, కార్యదర్శి రామక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-బూర్జ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రైతు పండించే పంటలకు విత్తనం నుండి ధాన్యం కొనుగోలు వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే చేదోడు వాదోడుగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. గురువారం బూర్జ మండలం పాలవలసలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్పీకర్ తమ్మినేని హాజరయ్యారు. పాలవలస పంచాయతీ పరిధిలోని రామన్నపేట గ్రామంలో సుమారు రూ. 10 లక్షల అంచనాలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని స్పీకర్ తమ్మినేని ప్రారంభోత్సవం చేశారు. సుమారు రూ. 21.80 లక్షల అంచనాలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని స్పీకర్ ప్రారంభించారు. అదేవిధంగా సుమారు పది లక్షల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రతి గ్రామం సర్వాంగ సుందరంగా రూపు దిద్దించడమే తన అభిమతమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు మరియు రాష్ట్ర టిట్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు మరియు సచివాలయాల కోఆర్డినేటర్

గుమ్మడి రాంబాబు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమ నాయుడు, పిఏసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణ మూర్తి, మండల సర్పంచుల సంఘ అధ్యక్షులు సూరాపు ఉదయ్, స్థానిక సర్పంచ్ జల్లు అంబుజాక్షి, స్థానిక నాయకులు డిసిసిబి డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, జల్లు అప్పలస్వామి నాయుడు, వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు, అధికారులు మరియు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలతో భవిష్యత్తును పాడుచేసుకోవద్దు : ఎస్ఐ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో స్నేహితురవకంగా మెలిగి చదువు కోవాలని అలాకాకుండా ఘర్షణలతో భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఎచ్చెర్ల ఎస్ఐ వి సత్యనారాయణ అన్నారు. వివరాల్లోకి వెళితే.... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో పలువురు విద్యార్థులు మధ్య ఘర్షణ జరిగింది. సినీ పక్కిలో విద్యార్థులు బాహా బాహీకి దిగడం విమర్శలకు దారి తీసింది. ఇంజనీరింగ్ కోర్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి పుట్టినరోజు వేడుక మంగళవారం రాత్రి క్యాంపస్ హాస్టల్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా బాణాసంచా కాల్చి సందడి చేశారు. పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న వేళ ఇదేంటి గోల అంటూ పీజీ విద్యార్థులు వారిని ప్రశ్నించారు. అర్ధరాత్రి సమయంలో అల్లరి సరికాదని వారించారు. దీంతో విద్యార్థుల మధ్య వాగ్వివాదం జరిగింది. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఇరువర్గాలు మరోసారి ఘర్షణకు దిగారు. సినీ పక్కిలో 20 నిమిషాలు బాగా బాహీకి దిగారు. ప్రశాంత వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులు ఇలా ప్రవర్తించడం చర్చానియాంశమైంది. దీనిపై చీఫ్ వార్డెన్ ఎస్ ఉదయ్ భాస్కర్ స్పందిస్తూ విద్యార్థుల మధ్య జరిగిన గొడవపై విచారణకు విసి నిమ్మ వెంకట్రావు కమిటీ నియమించారని చెప్పారు. ఓ వర్గంలో 12 మంది మరో వర్గం లో 15 మంది విద్యార్థులు ఈ వివాదంతో సంబంధం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింద న్నారు. కమిటీ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం పోలీసు చట్టాలు వాటి పరిణామాలను ఎస్ఐ వివరించారు. పిల్లలు భవితపై తల్లిదండ్రులు కనే కలలు నిజం చేసేలా ప్రవర్తించాలన్నారు. అలా కాకుండా అనవసరంగా అల్లరకు దిగితే బంగారు భవిష్యత్తును కోల్పోతారని చెప్పారు. ఎంతో దూరం నుంచి వచ్చే విద్యార్థులు సోదర భావంతో ముందుకు సాగాలన్నారు. బాధ్యులైన విద్యార్థులపై చర్యలకు సిఫార్సు: అంబేద్కర్ వర్సిటీలో హాస్టల్ విద్యార్థుల్లో పలువురు ఘర్షణకు దిగిన సంఘటనలో బాధ్యులపై చర్యలకు కమిటీ సిఫార్సు చేసింది. ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు నిర్ణయం తీసుకోవాల్సిఉంది.

విత్తనం నుంచి విక్రయం వరకు బాధ్యత : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మెళియపుట్టి : విత్తనం విక్రయ సరఫరా నుండి ధాన్యం అమ్మకం ప్రక్రియ వరకు ప్రభుత్వమే అన్ని చర్యలు చేప ట్టేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏర్పాట్లు చేశారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మెళియాపుట్టి మండలం పరశు రాంపురం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ రైతుల కష్టాలను గుర్తించే రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండడం కొరకు రైతు భరోసా కేంద్రాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా మార్చిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికి చెందు తుందన్నారు. ఈ ఏడాది సాధారణ వరి రకం ధాన్యం క్వింటాలకి 2183, గ్రేడ్ ఏ 2203 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించిందని ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. గన్ని సంచి లేబరు, రవాణా ఖర్చులు ప్రభుత్వము రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. జీపిఎస్ అమర్చిన వాహనాలలో ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి తోపాటు ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్, తాహసిల్దార్ సరోజినీ, వ్యవసాయ అధికారి దానకర్ణుడు, వ్యవసాయ మండల చైర్మన్ అలికాన మాధవరావు, వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్లు ప్రసాద్, ఈశ్వరరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు శరత్ కుమార్ రెడ్డి, నవీన్, షణ్ముఖరావు, వాసు, సిబ్బంది, రైతులున్నారు.

సీఎస్బీ ఖాతాదారులను పోలీసులు ఆరా

విశాలాంధ్ర-ఆముదాలవలస : గార ఎస్‌బీఐ బ్యాంకులో జరిగిన బంగారం కేసు నకు సంబంధించిన వివరాలను ఆరా తీయడంలో పోలీసులు నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికే 300 మంది ఖాతాదారులను పాతాలను పరిశీలించి అనుమానితులపై విచారణ చేపట్టారు. అందులో భాగంగానే ఆముదాలవలస సీ ఎస్ బి గోల్డ్ లోన్, లాకర్ సదుపాయం గల బ్యాంకు ఇటీవల ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న కొత్త ఖాతాదారులను శ్రీకాకుళం లావేరు గార పోలీసులు విచారణ నిమిత్తం కొందరు ఖాతాదారులను వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించి తమదైన శైలిలో విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి కొన్ని వాహనాల్లో వచ్చిన పోలీస్ అధికారులు సిఎస్‌బి బ్యాంకు ప్రతినిధితో ఖాతాదారులను గుర్తించి శ్రీకాకుళం లావేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఒక్కసారిగా పోలీసు వాహనాలు ఆముదాలవలస పట్టణంలో తిరగడంతో ఏం జరుగుతుందో అని జనం ఆందోళన చెందారు. ఈ ప్రాంతానికి సపరి స్తులైన కొంతమంది ఎస్సైలు ఆ టీంలో ఉన్నప్పటికీ ఎటువంటి సమాచారం తెలియక స్థానికులు ఆందోళన చెందారు. అర్ధ రాత్రి 12 గంటలకు ఖాతాదారులు వారి ఇంటికి చేరుకోవడంతో గార బంగారం కేసుకు సంబంధించి విచారణ చేస్తున్నట్లు తెలు సుకొని ఊపిరి పీల్చుకున్నారు. గురువారం గార, శ్రీకాకుళం, క్రైమ్, ఆముదాలవలస పోలీసులతోపాటు డి ఎస్ పి పోలీసు ఉన్న తాధికారులు సిఎస్‌బి బ్యాంకును, రికార్డు లను తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సేకరించిన సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. గార ఎస్బిఐ బ్యాంకులో జరి గిన ఏడు కోట్లు బంగారం కుంభకోణానికి సంబంధించి ఆముదాలవలసలో ఖాతాలను పరిశీలించడంపై పలు అనుమానాలు రేకెత్తు న్నాయి. ఇటీవలే గోల్డ్ లోన్ త్వరితగచ్చిన ఇచ్చేందుకు సిఎస్‌బి బ్యాంక్ ఉపకరి స్తుందని పట్టణంలో ఊదరగొట్టారు. ఈ నేపథ్యంలోని పలువురు ఆ బ్యాంకులో ఖాతాలు కూడా ప్రారంభించారు. వారికి చెక్‌బుక్‌తోపాటు ఏటీఎం కార్డు అందించి ఖాతాదారులను ఆకట్టు కునేందుకు పర్సనల్ లోన్లు కూడా ఇస్తామని నమ్మబలకడంతో మరి కొంతమంది ఖాతాదారులు ఎగబడి మరి ఖాతాలు ప్రారంభించారు. వీరిలో కొంతమందిని పోలీసులు విచారణ పేరుతో తీసుకు వెళ్లడంతో మిగిలిన ఖాతాదారులు ఒక్కసారిగా పొంగుతున్నారు. ఏది ఏమైన ప్పటికీ కొంతమంది చేసిన తప్పిదాలకు సామాన్యులు బలికాకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపైనే ఉంది.

జగన్ మాట... సంక్షేమ బాట

విశాలాంధ్ర-సోంపేట : ముఖ్యమంత్రి జగన్ మాట ఎల్లవేళలా సంక్షేమ బాటేనని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. సోంపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని అందరికీ సంక్షేమం అందించాలన్న తపనతో ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. ఆహర్నిశలు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అన్ని రంగాల అభివృద్ధి కోసం కృషి చేస్తూ అనేక విజయాలు సాధించిన ముఖ్యమంత్రిగా జగన్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేయకుండా 90శాతంకు పైగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. అటువంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి మళ్లీ అవసరమని చెప్పారు. మామిడిపల్లి పంచాయతీలో ప్రజలకు సంక్షేమ పథకాలు వాటి వివరాల చార్ట్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఈఓఆర్‌డి వెంకటరావు, సర్పంచ్ పాతిన శేషగిరి, శిలగాన భాస్కరరావు, ఎఎంసి చైర్మన్ బదకల మోహనరావు, జెసిఎస్ కన్వీనర్ బుద్ధాన శ్రీకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు రౌతు విశ్వనాధం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

విశాలాంధ్ర-పలాస : వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం సర్వ నాశినమైందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరి పై ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చినబడాం గ్రామంలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డులో పర్యటించి వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ఆక్రమణలు, అరాచకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అమలు చేస్తున్న పథకాల పై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతున్న టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయక పోగా కొండలు గుట్టలు వాగులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రైల్వే వంతెనకు రెండోసారి శంకుస్థాపన చేసి ఇప్పటికీ రైల్వే వంతెన పూర్తి చేయలేకపోయారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బి నాగరాజు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

ఫైల్ ఫొటో

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన గురువెల్లి గోవిందరావు (45) గురువారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తన పొలంలో ఉన్న వరి వోవులు తడిచిపోవడంతో ఆ వోవులను తిరగవేస్తుండగా వోవు కింద ఉన్న పాము గోవిందరావుకు కాటువేసింది. వెంటనే పాము కరిసిన విషయం పొలంలో ఉన్న కుటుంబసభ్యులు కేకవేసి చెప్పటంతో వారు పరుగున వచ్చి అందుబాటులో ఉన్న మోటార్ సైకిల్‌పై స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఆయితే అప్పటికే గోవిందరావు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. కాగా మృతుడు గోవిందరావుకు భార్య లక్ష్మి, ఇంటర్ మీడియట్ చదువుతున్న కుమారుడు మణికంఠ, 10వ తరగతి చదువుతున్న కుమార్తె కావ్యలు ఉన్నారు. గోవిందరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ ఆ కుటుంభానికి పెద్దదిక్కుగా ఉండేవాడని, పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య పిల్లలు రోదనలు మున్నంటాయి. గోవిందరావు ఆటో నడుపుతున్నా అందరితోను ఐక్యమత్యంతో కలగడుపుగా ఉండేవాడని, ఆయన ఆకస్మిక మృతి జీర్ణించులేకపోతున్నామని ఆయన మిత్రులు, బంధువులు గ్రామస్థుల రోధనలతో చిన్న హరిశ్చంద్రపురం గ్రామ సోకసద్రమైంది.

రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రజలు వైసీపీ పాలనతో విసుగుచెంది మార్పు కోరుకుంటున్నారని టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ హనుమంతు అప్పలరాజు అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ, హరిశ్చంద్రపురం గ్రామంలో ఆయన స్థానిక టిడిపి నాయకులతో కలిసి గురువారం భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అందించబోయే పథకాలను ప్రమాణపత్రం ద్వారా ఇంటింటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగుబారి రామప్పడు, డోకి నానాజీ, గంగిట్ల అప్పన్న, ఉప్పాడ సింహాచలం, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నియోనాటల్ 108 సేవలు ప్రజలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : నియోనాటల్ సేవలను వినియోగించుకోవాలని బోరుభద్ర పి.హెచ్.సి డాక్టర్ పి అవని, డాక్టర్ డి వనిత అన్నారు. మాతా శిశు మరణాల నివారణలో బాగంగా అప్పుడే జన్మించిన చిన్నారులను అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియోనాటల్ 108 అంబులెన్స్ సర్వీసును వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అంబులెన్సులో అత్యాధునిక వైద్య పరికరాలు ఇంక్యుబేటర్, మోనిటర్, డబుల్ ఆక్సిజన్, సిరెంజ్ పంపు, ఇన్‌ఫ్యూజన్ పంపు ఉన్నాయన్నారు. అలాగే 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దేవాది శ్రీనివాసరావు సిబ్బందికి వివరించారు. ఈ వాహనాల ద్వారా శిశువులను జిల్లాలోని గౌర్నమెంట్ హాస్పిటల్ కే కాకుండా, పేషంట్ అటెండర్స్ కోరిన ప్రైవేటు హాస్పిటల్ కు కూడా తరలిస్తారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమం లో, పైలట్ మూగి దుర్గా రావు, సి.హెచ్.ఓ. పద్మావతి, సూపర్వైజర్ లక్ష్మీ , స్టాఫ్ నర్స్ రాము, రోజ, హెల్త్ అసిస్టెంట్ జె చిరంజీవి, ఫార్మసిస్ట్ రుఖియ భేగం సిబ్బంది ముద్దాడ ఈశ్వర రావు, సుజాత, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-మందస : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, తడిసిన రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన నాయకులు గురువారం ధర్నా చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు బావన దుర్యోదన, జనసేన మండల అధ్యక్షులు కె.గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మందస మండల పరిధిలో చేతికి అంది వచ్చిన వరి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లిందన్నారు. వర్షాలకు కళ్లాల్లో, పొలాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో రంగు మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ ఎం.కృష్ణమూర్తికు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, దుంకూరు తిరుపతి, బమ్మిడి కర్రయ్య, కుప్పిలి వెంకటరావు, ఎం.నవీన్‌కుమార్, సవర లఖియా, సంతోష్ పండా, సూర్య, సంతోష్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవడం నేరం జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్ సన్యాసినాయుడు గురువారం లేబర్ డిపార్ట్మెంట్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ మరియు బ్రెడ్స్ ఎన్జీవో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వారితో సంయుక్తంగా జిటి రోడ్డులోని షాపులలో బాల కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. నేషనల్ కమిటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్స్ పిలుపు మేరకు నవంబర్ నెల 20 తారీకు నుంచి డిసెంబర్ 10వ తారీఖు వరకు జరిగే ఈ రెస్క్యూ ఆపరేషన్లో భాగంగా గురువారం జీటీ రోడ్డు లోని పలు షాపులలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నపిల్లలు ఎవరిని పనిలో పెట్టుకోరాదని వారిని చదువుకోడానికి ప్రోత్సహిస్తే వారి భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది కావున షాపు యజమానులెవరు చిన్న పిల్లల పనిలో పెట్టుకోవడానికి ప్రోత్సహించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సర్కిల్ వన్ శైలేష్ కుమార్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సబ్ ఇన్స్పెక్టర్ పోలీస్ కేశవరావు, టూ టౌన్ ఏఎస్ఐ శంకరరావు, బ్రెడ్స్ ఎన్జీవో గణపతి రావు, ఐసిపిఎస్ ఔట్రీచ్ వర్కర్ గీత, డిసిపియు చైల్డ్ లైన్ సూపర్వైజర్ మౌనిక పాల్గొన్నారు.